క్లుప్తంగా

డీఈగా ఆనంద్



చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు డివిజన్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రం (ఎస్పీఎం) డీఈగా ఆనంద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కదిరి డీఈగా ఉన్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో డీఈగా ఉన్న శ్రీనివాసమూర్తి పదోన్నతిపై పుంగనూరు ఈఈగా బదిలీ అయ్యారు. స్థానిక డీఈ కార్యాలయంలో ఆనంద్‌ను పలువురు అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి



పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: పిల్లలకు నిర్దేశిత సమయాల్లో తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. పోలియో, చికెన్ ఫాక్స్, తట్టు, కలరా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు రాకుండా ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఏఎన్‌ఎం షాహీనా, ఆశా కార్యకర్త సునీత పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'

ఐరాల: మండలంలోని చుక్కావారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె మండలంలో..

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెంగంపల్లె, కొండ్రాజు కాలువ గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరంలో 97 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమమంలో సీహెచ్‌ఓ రాజామణి, పీహెచ్‌ఎన్ భారతి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని మరకాలకుప్పంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైద్య సేవలు అందించనున్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నామన్నారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, యమున, శ్రీలత, భాస్కర్, రాధ, దేవప్రీత పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

చిత్తూరు అగ్రికల్చర్: తమకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక విజయ డెయిరీ ఎదుట ఆ డెయిరీ బుధవారం కార్మికులు నిరహారదీక్ష చేశారు. వారు మాట్లాడుతూ డెయిరీ మూతపడే సమయంలో తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. దీనిపై అప్పటి అధికారులను ప్రశ్నిస్తే వేతనాలు చెల్లిస్తామంటూ కొంత కాలం పాటు డెయిరీలో సెక్యూరిటీ డ్యూటీలు వేశారన్నారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడు ఆ డెయిరీ అమూల్ సంస్థ తీసుకున్నందున, తమకు మొత్తం జీతాలను లెక్కకట్టి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు.

మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలి



శుభ్రత పరికరాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: మండలంలోని ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని ఎంఈఓ హేమలత తెలిపారు. తవణంపల్లె సీఆర్‌సీలో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మరుగుదొడ్లు శుభ్రం చేసే పరికరాలను పంపిణీ చేశారు. హేమలత మాట్లాడుతూ పాఠశాలల్లో టాయిలెట్స్‌ను రోజుకు నాలుగు మార్లు శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాలల ఆవరణను శుభ్రం చేయించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

గుర్తింపుపై హర్షం

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌ను అధికారికంగా గుర్తించి, జీవో జారీ చేయడం అభినందనీయమని ఆ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ఆర్టీసీ టూ డిపో గేటు ఎదుట బుధవారం సంబరాలు చేసుకున్నారు. నాయకులు భాస్కర్, వేలు, అనురాధ, దాస్, వినోద్‌కుమార్, మోహన్‌వల్లి పాల్గొన్నారు.

- చిత్తూరు మండలానికి చెందిన వృద్ధురాలు జ్యోతి వడదెబ్బ బారిన పడి మే 21 వతేదీ చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చేరింది. డాక్టర్లు కూడా వడదెబ్బతోనే ఆమె ఇబ్బంది పడుతోందని గుర్తించారు. అయితే ఓ డాక్టరు అవగాహన లేకుండా థైరాయిడ్ పరీక్షకు సిఫార్సు చేశారు. బాధితురాలు ల్యాబ్ పరీక్షకు బయట చేయించడానికి రూ.600 ఖర్చు పెట్టుకుంది. తీరా అధికారులకు తెలియడంతో థైరాయిడ్ టెస్ట్ ఎందుకని ఆ దాక్టర్‌ను ప్రశ్నించారు. ఆయన మాత్రం సమాధానం ఇవ్వలేదు.
- గత నెల చిత్తూరు నగరం ఖాదర్‌మీనాన్ స్ట్రీట్‌కు చెందిన ఓ పసికందును అనారోగ్యంతో అడ్మిట్ చేశారు. డాక్టర్ అనుమతితో ఇంజక్షన్ ఇవ్వడంతో ఆ బిడ్డ మృతి చెందింది. దీనిపై తల్లిదండ్రులు స్పందనలో ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేసి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.
- నాలుగు రోజుల క్రితం చిత్తూరు నగరం సంతపేటకు చెందిన ప్రసాద్(42) తీవ్ర జ్వరంతో ఆస్పత్రిలో చేరారు. పరీక్షించిన వైద్యులు 105 డిగ్రీ జ్వరం ఉందని అడ్మిట్ చేసుకున్నారు. అయితే సిబ్బంది వైద్య సేవల్లో జాప్యం చోటుచేసుకోవడంతో ఆ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతని ప్రైవేటు ఆస్పత్రికి రెఫర్ చేసేశారు.
- చిత్తూరుకు చెందిన నాగయ్య తలకు తేలికపాటి గాయం కావడంతో కాళ్లు చేతులు లాగేశాయి. కుటుంబీకులు వెంటనే చిత్తూరు ఆస్పత్రిని ఆశ్రయించారు. వెంటనే అత్యవసర విభాగంలో సీటీ స్కాన్ తీశారు. తలలో బ్లడ్ గడ్డ కట్టిందని, ప్రాణాపాయముందని, వేరే ఆస్పత్రికి వెంటనే తీసుకెళ్లాలని రెఫర్ చేశారు. బాధితులు ఆగమేఘాల మీద తిరుపతిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేసి ఎలాంటి ప్రాణాపాయం లేదని, పది రోజులపాటు చికత్స తీసుకుంటే సరిపోతుందని ఇంటికి పంపించారు. ఇలాంటి కేసులు నిత్యం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వందల సంఖ్యలో చూస్తుంటాం.

విధుల్లోనే వైద్యుల కునుకు

జిల్లా ఆస్పత్రిని నిర్లక్ష్యపు రోగం పీడిస్తోంది. రోగులు బయట అవస్థ పడుతూ నిరీక్షిస్తుంటే, కొందరు వైద్యులు, సిబ్బంది ఆస్పత్రిలోనే కునుకుతీస్తున్నారు. పైగా ఆస్పత్రికి వైద్యులు చుట్టపు చూపుగా వస్తున్నారు. దీంతో రోగులు బాధలు భరించలేక అల్లాడిపోతున్నారు. ఎవరైనా గొంతువిప్పితే వెళ్లిపోండి అంటూ రెఫర్ పెట్టిస్తున్నారు. రకరకాల సాకులు వెతికి చెప్పడం అలవాటు చేసుకున్నారు. వైద్య సూత్రాలు చెబుతూ తప్పించుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఈ ఆస్పత్రి తీరు ఎప్పటికి మారుతుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్లక్ష్యం
- ఇన్‌పేషంట్లకు తప్పని తిప్పలు
- ప్రశ్నిస్తే ఇతర ఆస్పత్రికి రెఫర్
- బాధితుల నుంచి ఫిర్యాదుల వెల్లువ



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ఆస్పత్రికి పెద్ద ఆస్పత్రి అని పేరు. ఈ ఆస్పత్రికి ప్రతిరోజు అవుట్ పేషంట్‌లు 1000మందికిపైగా వస్తున్నారు. ఇన్‌పేషంట్‌లు 200 నుంచి 300 మంది ఉంటున్నారు. అత్యవసర కేసులు 150 వరకు ఓపీలు వస్తుంటాయి. వీరికి సేవలు అందించడంలో కొందరు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా అడ్మిట్ కేసులపై దృష్టి పెట్టడం లేదు. కొన్ని విభాగాల్లో మంచానపడిన రోగులను సిబ్బంది పట్టించుకోవడంలేదు. రోగుల అవస్థలు చూసి సహాయకులు చలించిపోతున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొంత మంది వారు ఇచ్చే మాత్రలు మింగుతూ మంచంపై కాలం వెళ్లదీస్తున్నారు. మరికొందరు మాత్రం మీ సేవలు వద్దంటూ పరుగులు పెడుతున్నారు.

నోరు విప్పితే రెఫర్

మా పేషెంట్‌ను పట్టించుకోవడంలేదని ఎవరైనా నోరు విప్పితే..సాకులు వెతికి అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేస్తుంటారు అక్కడి సిబ్బంది. బాధితుడి సహాయకులను ఛీ కొడుతుంటారు. మందులు, మాత్రలు లేవంటూ బయటకు పొమ్మంటారు. లేకుంటే ప్రాణానికి ప్రమాదమని భయపెడతారు. వీరి పోరు పడలేక చాలా మంది రోగుల సహాయకులే రెఫర్ పెట్టించుకుని వెళ్లిపోతున్నారు. కొందరి వైద్యులు, సిబ్బంది కారణంగా రెఫర్ కేసులు ఆస్పత్రిలో పెరిగాయి. ఎక్కువగా తిరుపతి స్విమ్స్, రుయా, సీఎంసీలకు రెఫర్ వెళుతున్నాయి.

దుమ్మా కొట్టు...

విధులకు చాలా మంది దుమ్మా కొడుతున్నారు. కాలక్షేపం కోసం అలా వార్డులు తిరుగుకుంటూ విధుల్లో సమయాన్ని వృథా చేస్తుంటారు. ప్రధానంగా వారికి కేటాయించిన వార్డుల్లో ఉండడం లేదు. కబుర్లు చెప్పుకోవడానికి సమయం కేటాయిస్తున్నారు. వారిని పట్టుకునేందుకు మిగిలిన సిబ్బంది వెదుకుతుంటారు. మరికొందరు విధులకు దుమ్మా కొట్టి, సొంత క్లినిక్స్‌లో వైద్యం చేస్తున్నారు. ఆ తర్వాత చుట్టపుచూపుగా వచ్చి మాయమవుతున్నారు.

ఫిర్యాదులు మామూలే

అక్కడి డాక్టర్లు, సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే, వాటిని సర్దుబాటు చేసే ప్రయత్నం చేయడం ఆస్పత్రిలో పరిపాటిగా మారింది. దీంతో ఎన్ని ఫిర్యాదులు వచ్చినా షరా మూములే అనుకుంటున్నారు. కాదని ఉన్నతాధికారుల వరకూ వెళ్లిలే కారణాలు చెప్పి తప్పించుకుంటున్నారు. దీంతో ఆ ఫిర్యాదులు చివరకు నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఫిర్యాదులు వస్తే ఎవరి వర్గాన్ని వారు కాపాడుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తారు. దీంతో ఆస్పత్రి నిర్వహణ పూర్తిగా గాడితప్పింది.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



ఆస్పత్రి సేవల విషయంలో నిర్లక్ష్యం చేస్తే వదిలిపెట్టేదిలేదు. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. పేషెంట్లతో మర్యాదగా ప్రవర్తించాలని పదే పదే చెబుతున్నాం. అయినా కొంత మంది తీరు మారడం లేదని తెలిసింది. వస్తున్న ఫిర్యాదులపై కూడా పూర్తి స్థాయిలో విచారిస్తాం. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. రెఫర్ చేస్తారనే భయం వద్దు.

–టీఎస్‌కే నాయక్, డీసీహెచ్ఎస్, చిత్తూరు

ఆస్పత్రిపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

జిల్లా ఆస్పత్రిలో అందుతున్న అసంతృప్తి సేవలపై 'స్కానింగ్ సేవలకు కత్తెర', 'మధ్యాహ్నానికే మూసివేత' శీర్షికలతో కథనాలు ఇటీవల 'సాక్షి' దినపత్రిలో ప్రచురితమయ్యాయి. దీనిపై రాష్ట్రస్థాయి అధికారులు స్పందించారు. ఈ కథనాలపై సీఎం పేషీ నుంచి డీసీహెచ్ఎస్‌కు ఆదేశాలు అందినట్లు ఆయన వెల్లడించారు. ఈ కథనంలో వచ్చిన వాస్తవాలు, సమస్యలపై పూర్తి స్థాయిలో విచారించి నివేదికలు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నిర్దేశించుకున్న లక్ష్యం మేర గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ హౌసింగ్ అధికారులు, నోడల్ అధికారులు, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. మునిసిపల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జగనన్న లే–అవుట్లలో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలోని లే–అవుట్లకు సంబంధించి ఈ వారాంతానికి 140 స్టేజ్ కన్వర్షన్లు, 40 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను సమన్వయం చేసుకొని, వారికి అవసరమైన సౌకర్యాలను సమకూర్చి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని చెప్పారు. మేస్త్రీలను అందుబాటులో ఉంచడం, నిర్మాణ సామగ్రి సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ అధికారులు, నోడల్ అధికారులు, అమినిటీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి వారాంతపు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తులు

యాదమరి: వైఎస్సార్ రైతు భరోసా కోసం రైతులు మండలంలోని రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి చరితా రెడ్డి కోరారు. నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు అర్హులై ఉంటే పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, ఫోన్ నంబర్‌తో వ్యవసాయశాఖ సహాయకుల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : అర్హత, ఆసక్తి ఉన్న వారు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాలలో డేటాఎంట్రీఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారికి పీజీ అర్హత ఉండాలని, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తామని ప్రిన్సిపల్ వెల్లడించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార వారోత్సవాల్లో అధికారులు

గుడిపాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత అన్నారు. మండలంలోని చామంతిపురం అంగన్‌వాడీ సెంటర్లో బుధవారం పోషకాహార వారోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పౌష్టికాహారం ప్రతి తల్లీ బిడ్డకు అందాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. జంక్‌ఫుడ్ పట్ల ఆకర్షితులైన యువత ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటోందని, బజారులో దొరికే ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది రోస్లిన్, రేఖ, వాసంతి పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్లపల్లెలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చివరి రోజు బుధవారం హిందూ జ్ఞాన వేదిక ప్రబోద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణభగవానుడి ప్రతిమను విశేషంగా అలంకరించి, పల్లకిపై కొలువుదీర్చారు. గ్రామంలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు భజనలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వృత్తిదారులకు ఉపయోగకరం

చిత్తూరు కార్పొరేషన్: చేతివృత్తిదారులకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ఉపయోగకరమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు తెలిపారు. స్థానిక మిట్టూరులో బుధవారం చేతివృత్తిదారులకు కరపత్రాలను అందజేశారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఈనెల 17న కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభిస్తుందన్నారు. ఆసక్తిగలవారు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు. బీజేపీ నాయకులు వెంకటేష్, రామభద్ర పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులతో మాట్లాడి జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 1,190 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. అందులో కొన్ని గృహాలు ప్రవేశానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగిలిన వాటి నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ స్టాన్లీ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం

బంగారుపాళెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి నవంబరు 2వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను మండలంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, ఈసీజీ స్కానింగ్ వంటి పరీక్షలు నిర్వహించి మందులను అందజేయనున్నట్లు వివరించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీహెచ్‌సీఓ రమేష్, ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్షపై అవగాహన

తవణంపల్లె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఒక బ్యాచ్‌కి, 3 గంటలకు రెండో బ్యాచ్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి వైద్యాధికారులు, సీహెచ్‌ఓ, పీహెచ్‌ఎన్, ఎంఎల్‌హెచ్‌ఓలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు తప్పక హాజరకావాలని కోరారు.



బంగారుపాళెం: జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గుడిపాల: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ప్రభావిత గ్రామాల్లోను తారు రోడ్లు, సీసీరోడ్లను అత్యధికంగా వేయించామని గుర్తుచేశారు. ఇప్పటివరకు గుడిపాలలో 6,688 పింఛన్లను ఇస్తుండగా కొత్తగా 396 పింఛన్లను అందజేస్తున్నట్లు వివరించారు. మొత్తంగా 7,084 మందికి 1కోటి 89 లక్షల రూపాయల నగదును పింఛను రూపంలో ప్రతి నెలా ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా ఇస్తున్నామన్నారు. వెయ్యి రూపాయలు వస్తున్న పింఛన్‌ను రూ.2వేలు చేసి ప్రస్తుతం రూ.2,750కి పెంచి ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ మొత్తం జనవరికి రూ.3వేలుకు పెరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సర్పంచులు రజినీకాంత్, ప్రసాద్‌రెడ్డి, విక్టర్, రవి, ఎంపీటీసీలు గోపి, డానియల్, యోవాన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శిలంబరసన్, సాయిక్రిష్ణ, క్రిష్ణ, కారిమేగన్, రవీంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

చిత్తూరు అర్బన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. చిత్తూరు మునిసిపల్ కార్యాలయంలో బుధవారం మేయర్ ఎస్.అముద, కమిషనర్ అరుణతో కలిసి శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులతో గడపగడపకు మన ప్రభుత్వం, సాధారణ నిధులతో చేపట్టిన పనులు, 15వ ఆర్థిక సంఘంతో చేపట్టిన పనులపై సమీక్షించారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. పనులకు సంబంధించి ప్రస్తుత పరిస్థితి, టెండర్ల స్థాయిలో ఎన్ని ఉన్నాయి, టెండర్లు పూర్తయిన వాటిని సత్వరం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు పూర్తయిన వాటికి సంబంధించి బిల్లుల ప్రక్రియ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. అధిక ప్రాధాన్యత ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. హైరోడ్డు విస్తరణ చేపట్టాలని, స్మార్ట్ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్యం మరింత మెరుగుపరచాలని, డ్రైనేజీలో పూడిక తొలగించే పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లు, దుకాణాలకు సంబంధించి రెవెన్యూ వసూళ్లు పూర్తిస్థాయిలో చేపట్టి ఆదాయాన్ని పెంచాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్దన్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొత్త పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



పూతలపట్టు: పింఛను అందిస్తున్న నాయకులు

కొత్త పింఛన్ల పంపిణీ

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని పథకాల్లో జగనన్న పింఛను చాలా ప్రాముఖ్యమైనదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో బుధవారం కొత్త పింఛన్లను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. వృద్ధాప్య పింఛన్లు–30, వితంతువు–8, దివ్యాంగుల –5, డప్పుకళాకారులు–4, కల్లు గీతకార్మికులు– 1, ఒంటరి మహిళ పింఛను కింద 49 మందికి కొత్త పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వల్లి, సర్పంచ్ మాసిలామణి, పంచాయతీ కార్యదర్శి ఖాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మజ పాల్గొన్నారు.

సమస్యలపై జేసీకి వినతి

చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ, వీఆర్వో ఉద్యోగుల సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులను కోరారు. ఆ సంఘాల నాయకులు బుధవారం జేసీని కలిసి పలు సమస్యల పరిష్కారంపై చర్చించారు. జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమరనాథ్, హుస్సేన్ మాట్లాడుతూ వీఆర్వో కేడర్ నుంచి తహసీల్దార్ కేడర్ వరకు సస్పెన్షన్ సమస్యలు పరిశీలించి పరిష్కరించాలన్నారు. వీఆర్‌ఓ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీరెడ్డి, పద్మనాభం మాట్లాడుతూ వీఆర్వో ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని జేసీ హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళిమోహన్, గుణశేఖర్‌రెడ్డి, మార్కొండ, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.



జేసీతో చర్చిస్తున్న రెవెన్యూ, వీఆర్వో సంఘాల నాయకుల

ఆయుష్మాన్ భారత్‌తో అందరికీ వైద్యం



ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: ఆయుష్మాన్ భారత్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం చేయాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఆయన జెండా ఊపి ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం వల్ల ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి రక్త పరీక్షలు చేసి దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులను గుర్తించి వారందరికీ ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. ఇందులో 160 రకాల మందులను అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శేషగిరిరావు, హరి, సందీప్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైద్య సిబ్బంది చంద్రశేఖర్, నరసింహమూర్తి, జబసెల్వి, విజయ, అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ



యూనిఫాం అందుకున్న విద్యార్థులతో దాత, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం యూనిఫాం దుస్తులను ఉచితంగా అంజేశారు. స్థానిక కళాశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సంయుక్త తన సొంత నిధులతో జూనియర్ ఇంటర్ చదువుతున్న 18 మంది విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం దుస్తులను హెచ్‌ఎం బేరినాథ్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా

Bank of Baroda

కట్టమంచి శాఖ, తిరుపతి రోడ్, చిత్తూరు

ఫోన్ నెం.9154 285 299

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా శాఖ నందు బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకున్న ఈ క్రింది ఋణగ్రహీత తేది.28-09-2023, సాయంత్రం 4.00 గం॥ల లోపున అసలు, వడ్డీ మరియు బ్యాంకు ఖర్చులు మొత్తం చెల్లించవలెను. లేనియెడల తేది.29-09-2023 (శుక్రవారం) మధ్యాహ్నం గం॥ 3.00 లకు బ్యాంకు ఆవరణలో బహిరంగ వేలము వేయబడును. ఈ క్రింది ఋణగ్రహీతకు నోటీసు పంపటం జరిగినది. అవి ఏ కారణం చేతనయినా నోటీసులు అందనివారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. వేలం వేయుటకుగానీ, రద్దు చేయుటకుగానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము గలదు. ఈ వేలములో కొనుగోలు చేసిన బంగారు నగల పూర్తి సొమ్ము వెంటనే చెల్లించవలెను మరియు బ్యాంకు నియమ నిబంధనలకు అనుసరించి వేలములో పాల్గొనవలెను.

లోన్ ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు, తండ్రి పేరు మరియు చిరునామా	బంగారు గ్రాములలో
84220600005796	శ్రీ జె శ్రీనివాసమూర్తి, తండ్రి : జె ఆర్ సాయి ప్రసాద్ 22-458, లాయర్స్ కాలనీ, కట్టమంచి, చిత్తూరు-517001.	32.50

తేది : 13.09.2023 సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, కట్టమంచి శాఖ